ప్రజలపై విద్యుత్ భారాలు

- 30న సబ్ స్టేషన్ల వద్ద ధర్నా
- జయప్రదం చేయాలి : వామపక్షాలు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతోందని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఈనెల 30న తేదీన సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో ధర్నా పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు వాడిన విద్యుత్‌కు అదనపు (ట్రూఅప్ ఛార్జీ) పేరుతో ఇప్పుడు వసూలు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దీనివల్ల గతంలో అద్దెకున్న వాళ్లు వాడుకున్న కరెంట్‌కు ఇప్పుడు అద్దెకు ఉంటున్న వారు చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రపంచంలో కరెంటు ఛార్జీలు తగ్గాయని, ఒకప్పుడు సోలార్ విద్యుత్ యూనిట్ రూ.12 ఉండగా, నేడు ఉత్పత్తి ఖర్చు తగ్గి రూ.రెండుకే వస్తోందని తెలిపారు. కరెంట్ ఛార్జీలు తగ్గించాల్సింది పోయి ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. పాలకులు, కార్పొరేట్ సంస్థలు కుమ్మక్కై రూ.రెండుకు కొనాల్సిన యూనిట్ విద్యుత్‌ను రూ.10 నుంచి రూ.12కు కొంటున్నారని విమర్శించారు. ఇటీవలే హిందూజా కంపెనీకి రూ.1200 కోట్ల అదనపు ఛార్జీల పేరుతో ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. స్మార్ట్ మీటరు పేరుతో విద్యుత్ రంగాన్ని మొత్తం అదానీకి అప్పజెప్పుతున్నారని విమర్శించారు.

స్మార్ట్ మీటరు రూ.13 వేలు చొప్పున అదానీతో అగ్రిమెంట్ చేసుకుని, దీనికి తోడు నెలకు రూ.120 నుంచి రూ.150 వసూలు చేయడానికి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసిందని, నేడు వైసిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్తుందని విమర్శించారు. సర్దుబాటు ఛార్జీల వసూలు నిలిపివేయాలని, విద్యుత్‌రంగ ప్రయివేటీకరణను విరమించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గృహ వినియోగదారులు అందరికీ వంద యూనిట్ల లోపు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, అదానీతో సహా పలు కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు.

చట్టమంటే లెక్కలేనితనమా?

- జిల్లాలో అపహాస్యం పాలవుతున్న విద్యాహక్కు
- 25 శాతం సీట్లు కేటాయించాలని చెప్తున్న చట్టం
- 40 స్కూళ్లలో ఒక్కరికీ ప్రవేశం కల్పించని ప్రయివేట్ యజమాన్యాలు
- పట్టించుకోని విద్యాశాఖ

ప్రయివేట్ పాఠశాలల్లో అధికంగా ఫీజులు ఉన్నాయంటూ ప్రభుత్వం గతేడాది గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఎంతమేర వసూలు చేయాలో ఒక జిఒ తెచ్చింది. దానిపై కోర్టు కెళ్లిన యాజమాన్యాలు వాటిని రద్దు చేసుకునే వరకు విశ్రమించలేదు. ఇతర కొన్ని తరగతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీతో తమకు భారంగా ఉందని, అమ్మఒడి అమలు చేస్తున్నందున వారికి ఫీజులు తగ్గించలేమంటూ కోర్టును ఆశ్రయించి అందులోనూ విజయం సాధించారు. ఇలా తమకు ఇబ్బందిగా ఉన్న వాటిపై కోర్టును ఆశ్రయించి హక్కులను కాపాడుకుంటున్న ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు విద్యాహక్కు చట్టం అమలు దగ్గరకొచ్చేసరికి మాత్రం చట్టాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు అన్ని ప్రయివేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను రిజర్వు చేయాలని విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) చెప్తోంది. ఆయా పాఠశాలలు అందుకనుగుణంగా ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాలని సూచిస్తోంది. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలలు 398 ఉన్నాయి. వాటిలో ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ 394, సిబిఎస్‌ఇ సిలబస్‌తో నడుస్తున్న ప్రయివేట్ అన్ ఎయిడెడ్ నాలుగు ఉన్నాయి. వీటిలో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఆర్‌టిఇ చట్టం అమలు కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో దరఖాస్తులను స్వీకరించింది. మార్చి నెలాఖరులో ఒకసారి, ఏప్రిల్‌లో రెండు విడతలుగా ప్రవేశాలు కల్పించారు. ప్రయివేట్ స్కూళ్ల కల్పించిన ప్రవేశాలు చూస్తే చట్టాన్నే అపహాస్యం చేసేలా ఉన్నాయి. ప్రతి స్కూల్‌లో 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉండగా, కొన్ని స్కూళ్లు ఒకట్రెండు సీట్లతో సరిపెట్టారు. గరిష్టంగా 20 సీట్లకు మించి ఏ స్కూలూ ప్రవేశాలు కల్పించలేదు.

పదింటిలోనే రెండంకెల సంఖ్యలో ప్రవేశాలు

జిల్లా విద్యాశాఖాధికారుల లెక్కల ప్రకారం ప్రయివేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్లు మొత్తం 398 ఉండగా, ఈ విద్యా సంవత్సరంలో 185 స్కూళ్లు మాత్రం ప్రవేశాల కల్పనకు ముందుకొచ్చాయి. జిల్లాలో మొత్తం 564 మందికి కేటాయించగా, అందులో 442 మంది పిల్లలు చేరారు. మిగిలిన 122 పలు కారణాలతో పాఠశాలల్లో చేరలేదు. శ్రీకాకుళం నగరంలోని భాష్యం పబ్లిక్ స్కూల్‌లో అత్యధికంగా 23 మందికి ప్రవేశం కల్పించారు. ఆ తర్వాత నగరంలోని గీతాంజలి స్కూల్‌లో 21 మందిని చేర్చుకున్నారు. రణస్థలం మండలం కోష్టలోని శ్రీనారాయణ స్కూల్‌లో 22 మందికి ప్రవేశాలు కల్పించారు. శ్రీకాకుళం నగరంలోని న్యూ సెంట్రల్ స్కూల్, జలుమూరులోని విజ్ఞానదుర్గా హైస్కూల్ యాజమాన్యాలు 16 మందికి అవకాశం కల్పించాయి. ఆమదాలవలసలోని సాయిరాం అన్‌ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 14 మందికి, శ్రీకాకుళం నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్, రణస్థలంలోని ఆర్డర్ స్కూల్ చెరో 13 మందిని చేర్చుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని సాయి ఆదిత్య, శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ పది మంది చొప్పున చేర్చుకున్నారు.

40 స్కూళ్లలో ఒక్కరికీ ప్రవేశం లేదు

ఒకటో తరగతిలో పేద పిల్లలకు ప్రవేశాల కల్పన ప్రయివేట్ విద్యాసంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంది. జిల్లాలోని 40 స్కూళ్లలో ఒక్క విద్యార్థికీ ప్రవేశం కల్పించలేదు. వాటిలో కార్పొరేట్ స్కూళ్లతో పాటు ఒక స్థాయిలో విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలూ ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి నిర్వహించడం లేదా?, దరఖాస్తు చేసుకున్న వారిని యాజమాన్యాలు తిరస్కరించాయా? అన్నది అధికారుల స్వీయ పరిశీలనలోనే తేలే అవకాశం ఉంది. అధికారులు ఎవరూ పాఠశాలలను సందర్శించినట్లుగా కనిపించడం లేదు. కార్పొరేట్ స్కూళ్లు ఒకటో తరగతికి మూడేసి సెక్షన్లు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. విద్యాశాఖ అధికారులు మాత్రం ఎవరూ దరఖాస్తు చేయకపోతే వారు మాత్రం ఎలా సీట్లు ఇస్తారంటూ యాజమాన్యాలను సమర్థిస్తున్న పరిస్థితి నెలకొంది. శ్రీకాకుళం నగరంలోని గీతాంజలి స్కూల్ 21 మందికి ప్రవేశం కల్పిస్తే, అక్కడకు సమీపంలోని మహాలక్ష్మినగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ కేవలం ముగ్గురిని మాత్రమే చేర్చుకున్నారు. గీతాంజలి, శ్రీచైతన్య స్కూల్ విషయానికి వస్తే తల్లిదండ్రులు దేనికి ప్రాధాన్యమిస్తారో వేరే చెప్పనక్కర్లేదు. ప్రవేశాల సంఖ్యలో తేడాలు ఉన్నాయంటే అమల్లో ఎవరి లోపం ఉందో స్పష్టమవుతోంది.

దరఖాస్తు చేసుకుంటే ప్రవేశాలు కల్పిస్తారు

జిల్లాలో విద్యాహక్కు చట్టం అమలుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 442 మంది పేద పిల్లలకు ప్రయివేట్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించాం. ఏ స్కూల్‌లో అయినా దరఖాస్తు చేసుకుంటే సీటు ఇస్తారు. అర్హులై ఉండి ప్రవేశాలు కల్పించలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- తిరుమల చైతన్య,
జిల్లా విద్యాశాఖాధికారి

ప్రజా వైద్యానికి ప్రథమ ప్రాధాన్యం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజా వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సమూల మార్పులు తీసుకొచ్చిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగర పరిధిలోని ఖాజీపేటలో రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ప్రారంభించారు. నాలుగేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత దగ్గర చేశామన్నారు. గతంలో వైద్యం అందాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నామన్నారు. విలేజ్ క్లినిక్‌లో 102 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, పాము కాటుకు సైతం అక్కడే మందులు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వాస్పత్రులకు అత్యాధునిక సౌకర్యాలను కల్పించి ప్రజలకు ఉపయోగపడేలా వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. అవినీతి లేని పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వం పథకాల లబ్ధిని వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు, డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, ఎఎంసి ఛైర్మన్ ఎం.తాతబాబు, డిసిఎంఎస్ ఛైర్మన్ గొండు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణ వద్దు

- 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తులకు విక్రయం సరికాదు
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- డిసిసిబి వద్ద సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సహకార రంగంలో అత్యంత కీలకమైన పిఎసిఎస్‌ల్లో 50 శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులు, కంపెనీలకు ఇస్తే ఊరుకునేది లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు హెచ్చరించారు. నగరంలోని డిసిసిబి కార్యాలయం వద్ద సహకార సంఘాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన సహకార ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలపై, ఉద్యోగులపై ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి సరికాదన్నారు. రైతుభరోసా కేంద్రాలను పిఎసిఎస్‌ల్లో విలీనం చేసేందుకు తీసుకొచ్చిన జిఒను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రంగనాథ్ మాట్లాడుతూ జిఒ నంబరు 90 ప్రకారం వేతనాలు, ఇతర బెనిఫిట్లను వెంటనే అమలు చేయాలన్నారు. 2016 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉద్యోగులకు మోనటరీ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీని చట్ట ప్రకారం అమలు చేయాలన్నారు.

2019 ఏప్రిల్ ఒకటో తేదీ నాటి వేతన సవరణను వెంటనే అమలు చేయాలని కోరారు. జిఒ 36లో ఉదహరించిన డిఎ పద్ధతిని మాత్రమే అనుసరించి ఆప్కాబ్ మార్గదర్శకాల్లో ఇచ్చిన 24.90 శాతాన్ని వెంటనే సవరించాలన్నారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులను తొలగించి సకాలంలో బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 ఏళ్ల ఉద్యోగ విరమణ వయసును పెంచాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.మోహనరావు, బి.రామారావు మాట్లాడుతూ సహకార సంఘాల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. 2019 తర్వాత సహకార సంఘాల్లో చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డిసిసిబి అసోసియేషన్ అధ్యక్షులు జి.మురళి, రమేష్, లక్ష్మీనారాయణ, కోశాధికారి బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

- జెసిని కోరిన చేనేత సంఘ నాయకులు
- 'స్పందన'కు 186 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చేనేత కుటుంబాలను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎన్.వి రమణ కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. నేత కార్మికులు ప్రస్తుతం చాలినంత పని లభించక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మగ్గాలున్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. షెడ్డుల్లో నేస్తున్న కార్మికులకు, చేనేత ఉప వృత్తుల కార్మికులను ఆదుకోవాలని కోరారు. ప్రతి నేతన్న కుటుంబానికి మూడు సెంట్ల స్థలం మంజూరు చేసి, హౌస్ కమ్ వర్క్ షెడ్ నిర్మించుకునేందుకు వీలు కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.గిరీష్, ఎం.వేణు తదితరులున్నారు.

వినతులు స్వీకరిస్తున్న జెసి నవీన్

రణస్థలం మండలంలోని యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ యాజమాన్యం అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుని, పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇజ్జు నారాయణరావు, జె.గంగరాజు తదితరులున్నారు.

ఎటువంటి వివాదం లేదని తన భూమిని 22ఎలో ఉంచారని సంతబొమ్మాళి మండలం సందిపేటకు చెందిన రైతు రామారావు వినతిపత్రం అందించారు. గతంలో ఇదే సమస్యపై స్పందనలో వినతిపత్రం అందజేశానని, 60 రోజుల తర్వాత తహశీల్దార్ ఈ భూమి గ్రామకంఠంలో ఉందని, భూమి హక్కు పత్రాలను తీసుకురావాలని ఎండార్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. జెసి నవీన్ సంతబొమ్మాళి తహశీల్దార్‌కు ఫోన్ చేశారు. ఆయన అందుబాటులోకి రాకపోవడంతో, టెక్కలి సబ్ కలెక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. మొక్కుబడి ఎండార్స్‌మెంట్ ఇచ్చిన తహశీల్దార్‌కు షోకాజ్ నోటీసును జారీ చేయాలని ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణను ఆదేశించారు.

రణస్థలం, లావేరు మండలాల్లో కంకర తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేకున్నా, వందెకరాల విస్తీర్ణంలో తవ్వకాలు చేస్తున్నారని పెద్దపేటకు చెందిన యువకులు ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస మండలంలో భూముల సమగ్ర సర్వే తప్పుల తడకగా ఉందని, సరిచేయాలని పలువురు రైతులు కోరారు. పలు శాఖల్లో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ ఉద్యోగాలను 19 ఏళ్లుగా భర్తీ చేయలేదని, వాటిని వెంటనే భర్తీ చేయాలని గ్రంథాలయ సైన్స్ నిరుద్యోగ జెఎసి ఉత్తరాంధ్ర నాయకులు జామి శ్రీకాంత్‌బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రౌతు వేణు, కమల్ కుమార్ కోరారు. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వినతులు స్వీకరించగా, జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 186 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, డిఎస్ఒ వెంకటరమణ, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఇఒ తిరుమల చైతన్య, ఎస్ఎస్ఎ ఎపిసి జయప్రకాష్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మా గ్రామానికి రావద్దు

- ఏం చేశారని వస్తున్నారు
- ఎమ్మెల్యే రెడ్డి శాంతిని అడ్డుకున్న కుంటిభద్ర గ్రామస్తులు

ప్రజాశక్తి - కొత్తూరు

పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి నిరసన సెగ తగిలింది. గ్రామానికి సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చకపోవడంపై మండలంలోని కుంటిభద్ర గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే రెడ్డి శాంతిని అడ్డుకున్నారు. ఆమె కారు దిగిన వెంటనే గ్రామంలోకి రానీయకుండా చుట్టుముట్టారు. 'ఏం చేశారని మా గ్రామానికి వస్తున్నారు. మీరు మా గ్రామానికి రావద్దు' అని ముఖం మీదే చెప్పేశారు. ఊరికి రోడ్డు, ఇంటింటికీ కుళాయిలు వేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీలు నెరవేర్చడానికి నాలుగేళ్ల సమయం సరిపోలేదా, మళ్లీ ఇప్పుడు ఏం చెప్పడానికి వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుచరులు, పోలీసులు గ్రామస్తులకు సర్దిచెప్పడానికి విఫలయత్నం చేశారు. దీంతో చేసేది లేక ఎమ్మెల్యే వెనుదిరిగారు. అంతకుముందు కుంటిభద్ర కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

ఎమ్మెల్యేను అడ్డుకుంటున్న కుంటిభద్ర గ్రామస్తులు

ప్రత్యామ్నాయ ఉపాధికి ప్రోత్సాహం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నాటుసారా తయారీ రవాణా, విక్రయాలు మానుకుని సత్ప్రవర్తనతో ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు పొందాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గతంలో నాటుసారా తయారీ రవాణా, విక్రయాలు చేసి పట్టుబడిన ఆరుగురికి అవగాహన కల్పించి, వారికి ఉపాధి కల్పించేందుకు రూ.3.90 లక్షల చెక్కు, బ్యాంకు రుణపత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి రాధిక సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యపాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. జిల్లాలో ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాల కోసం 20 మందిని గుర్తించామన్నారు. అందులో ఆరుగురు ఎంపికయ్యారని తెలిపారు. సత్ప్రవర్తనతో నడుచుకొని మరికొంతమందిలో పరివర్తన తీసుకురావాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన రుణంతో జీవనం సాగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి వి.ఎన్ మణికంఠ, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.పి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

25న 'బొడ్డేపల్లి' శతజయంతి ఉత్సవాల ముగింపు

శ్రీకాకుళం : ఈనెల 21న నిర్వహించాల్సిన మాజీ ఎంపీ కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుకను ఈనెల 25వ తేదీకి వాయిదా వేసినట్లు కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఏడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన రాజగోపాలరావు విగ్రహాన్ని ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా నాయకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

ప్రజాశక్తి
పత్రిక కొత్త చందాదారులుగా చేరాలనుకునే వారు, పత్రిక పంపిణీలో ఇబ్బందులున్న వారు ఈ క్రింది ఫోన్ నెంబరును సంప్రదించగలరు
బి.సింహాచలం : 83329 75538

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పోలాకి, కోటబొమ్మాళి

పిడుగుపాటుకు పోలాకి మండలం జిల్లేడు మాకివలసకు చెందిన శిమ్మ తవుడు (49) సోమవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తవుడు వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఐదు గంటలకు చెరువుకు బహిర్భూమికి వెళ్తుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ జీవనాధారాన్ని కోల్పోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

తవుడు (ఫైల్)

మృతి చెందిన పాడి గేదెలు

పిడుగు పడి రెండు గేదెలు మృతి

కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేటలో చింతు పొట్టెన్నకు చెందిన రెండు పాడి గేదెలు పిడుగు పడి మృతి చెందాయి. సోమవారం వేకువజామున కురిసిన వర్షానికి పిడుగు పడడంతో చెట్టు కింద కట్టిన గేదెలు మృత్యువాత పడ్డాయి. రూ.1.20 లక్షల అప్పు చేసి కొన్నానని, జీవనాధారంగా ఉన్న గేదెలు మృతి చెందడంతో తమ కుటుంబం రోడ్డున పడిందని పొట్టెన్న అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

యోగాపై విస్తృత ప్రచారం

శ్రీకాకుళం అర్బన్ : ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. యోగా దినోత్సవ పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో సోమవారం ఆవిష్కరించారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM
O.S.47/2022

Between:
Pilaka Yerrayya. **--Plaintiff.**
And:
Pasala Rajkumar **--Defendant.**

To,
Pasala Rajkumar, S/o late Tavitayya @ Tavudu, aged about 38 years, Employee, resident of Door NO.5-238, Muddada Street, Narasannapeta Town and Mandal, Srikakulam district.

Please take notice that the above suit **O.S 47/2022** matter is posted to **03.07.2023 at 10.30 A.M.** for your notice to appear before the hon'ble court and **I.A226/2022 in O.S 47/2022** either In person or through an advocate other wise the Honurable court the matter will be heard in your absence.

// By Order of the court //

TULUGU MADHUSUDAN RAO
SUVVARI GADDEYYA
Advocates, Srikakulam
Cell: 9440398634, 9441320595

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT AMADALAVALASA
O.S. 122/2022

Between : **Canara Bank, Amadalavalasa represented by its Branch Manager.** --Plaintiff
And : **M/S Ojhaswine Enterprises, Main Rad, Kollivalasa, represented its proprietor, Gurugubelli Sridhar.** --Defendant
To,
M/S Ojhaswine Enterprises, Main Rad, Kollivalasa, represented its proprietor, Gurugubelli Sridhar, S/o Late Krishnarao, R/o Door No. 1341, Main Sreet, Srihari puram village, Amadalavalasa Mandal, Srikakulam District.

మీ పై వాది దావా పైకము రాబట్టుటకై పై నెంబరు దావా వేసినందున మీకు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా ఎన్ని సార్లు సమన్లు పంపినప్పటిప్పటికీ మీరు తీసుకొనక తప్పించుకున్నారు. గాన శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే 28.06.2023 ది ఉదయం గం॥ 10.30** లకు స్వయంగా గానీ వకీలు ద్వారా హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేయని యెడల మీ పరోక్షమందు దావా తీర్మానించెదరని యిందు మూలము తెలియజేయుచున్నాము.

// By Order of the court //

H. ATCHINNAIDU
Advocate, Amadalavalasa,
Cell: 7680818742

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT AMADALAVALASA
O.S. 123/2022

Between : **Canara Bank, Amadalavalasa represented by its Branch Manager.** --Plaintiff
And : **M/S Ojhaswine Enterprises, Main Rad, Kollivalasa, represented its proprietor, Gurugubelli Sridhar.** --Defendant
To,
M/S Ojhaswine Enterprises, Main Rad, Kollivalasa, represented its proprietor, Gurugubelli Sridhar, S/o Late Krishnarao, R/o Door No. 1341, Main Sreet, Srihari puram village, Amadalavalasa Mandal, Srikakulam District.

మీ పై వాది దావా పైకము రాబట్టుటకై పై నెంబరు దావా వేసినందున మీకు కోర్టు ద్వారా రిజిష్టరు పోస్టు ద్వారా ఎన్ని సార్లు సమన్లు పంపినప్పటిప్పటికీ మీరు తీసుకొనక తప్పించుకున్నారు. గాన శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే 28.06.2023 ది ఉదయం గం॥ 10.30** లకు స్వయంగా గానీ వకీలు ద్వారా హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేయని యెడల మీ పరోక్షమందు దావా తీర్మానించెదరని యిందు మూలము తెలియజేయుచున్నాము.

// By Order of the court //

H. ATCHINNAIDU
Advocate, Amadalavalasa,
Cell: 7680818742

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
S.O.P. 10/2023

Between:
1. Maram Suneeta, W/o Sridhar, D/o Yetchina Kasipathi, aged about 43 years, Hindu, Household duties, resident of Banerjee Para Talpukur, Barrackpur, Talpakur North, 24 Praganas District, West Bengal State.
2. Madugula Prasanna, W/o Venkata Ramana Murthy, aged about 40 years, Hindu, Household duties, resident of Door No.20-18/1-125, Plot No.125, Krishnarajapuram, 100 Feet Ring Road, Vizianagaram Town and District.
3. Kondeti (Yetchina) Rama Kumari, W/o Kondeti Ravi Kumar, aged about 39 years, Hindu, Household duties, resident of Door No. 14-9-87, Balayyapeta, near Sivalayam, Patha Srikakulam, Srikakulam Town and District.
- Petitioners.
And: -Nil- - Respondent.

పై నెంబర్ గల **S.O.P**లో **Yetchina Raja sekhar** రోడ్డు ప్రమాదంలో చనిపోయినందున రాజశేఖర్ కు వివాహం కానందున పైన తెలిపినవారు ముఖ్య వారసులై ఉన్నందున పిటిషనర్స్‌కు **succession certificate** ఇప్పించవలసిందిగా పై కోర్టులో ఫికేషన్ దాఖలు చేయడమైనది. రాజశేఖర్‌కు తల్లిదండ్రులు కూడా చనిపోయినారు. కావున మీకు ఏమైనా లేక ఎవరికీ ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల **తేదీ 24-07-2023** దిన **ఉదయం 10:30గం॥లకు** పైకోర్టులో తెలియ జేయవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడమగుని ఇందుమూలంగా తెలియ జేయడమైనది

కోర్టు ఆదేశాల సారముగా

SAKALABHAKTULA SAI KISHOR
ADVOCATE,
SRIKAKULAM
CELL: 9493659846.

సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

వరుణ్ చక్రవర్తికి సన్మానం

ప్రజాశక్తి- నరసన్నపేట
జాతీయ స్థాయి నీట్ పరీక్షలో వరుణ్ చక్రవర్తి తొలి ర్యాంకు సాధించి జిల్లాకు చరిత్రాత్మకమైన గుర్తింపు తీసుకురావడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట ఎస్ఎల్ఎవిడి కళ్యాణ మండపంలో దేశంలో జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచినందుకు విద్యార్థిని, వారి తల్లిదండ్రులను సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వికాసానికి సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నిరవధికంగా కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతిభకు కేంద్రాలుగా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఇలాంటి తరుణంలో వరుణ్ చక్రవర్తి లాంటి వారు సాధిస్తున్న విజయాలు ఎంతోమందికి మరింత ప్రేరణ, స్ఫూర్తిని అందించి వారిని కర్తవ్యం దిశగా నడిపిస్తాయని అన్నారు. వరుణ్ కృషిని ప్రతి ఒక్క విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబంలో విద్య వికసించాలన్నదే సిఎం ధ్యేయమన్నారు. వరుణ్ చక్రవర్తిని సిఎంతో సన్మానించడానికి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. పేదరికం విద్యకు శాపం కాకూడదని, ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యకు తగిన ప్రోత్సాహం సిఎం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళి, వాన గోపి, సీనియర్ నాయకులు చింతు రామారావు, పంగ బావాజీనాయుడు, సర్పంచ్ బురెళ్ల శంకర్, కొరాడ చంద్ర భూషణ్ గుప్తా, రాజాపు అప్పన్న, బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, పొట్నూరు సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌పి 'స్పందన'కు 33 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం
స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై వారం రోజుల్లోపు ఆయా ఫిర్యాదుల పరిష్కార నివేదిక పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ మండలాల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సోమవారం స్వీకరించారు. ఈ స్పందనలో 33 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోసపూరితమైన ఫిర్యాదులు మూడు, కుటుంబ తగాదాలకు సంబంధించినవి మూడు, పౌర సంబంధాలపై పది, పాత ఫిర్యాదులు రెండు, ఇతరులు 15 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదుల వివరాలు, వారి సమస్యలను తెలియజేశారు. ఫిర్యాదిదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. ఫిర్యాదుల చర్యలపై వారంలో నివేదిక అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

మౌలిక సదుపాయాలు కల్పించరూ...

స్పీకర్‌ను కోరిన శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ గౌరీపతి

ప్రజాశక్తి- ఆమదాలవలస
గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట గ్రామాల్లో రూ.1.13 కోట్ల నిధులతో జల జీవన మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయి ఏర్పాటు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గత నెల స్పీకర్ చేతుల మీదుగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం ఆ రోజు వరకే తెరచి ఉంచారని అన్నారు. మరుసటి రోజు నుంచి వాటికి తాళాలు వేశారని, ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వం తమకు బిల్లులు చెల్లించలేదని, అందుకే తాళాలు వేశామని కాంట్రాక్టర్ బహిరంగంగా చెబుతున్నాడని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పీకర్ కలుగజేసుకుని ఆర్‌బికె, సచివాలయం తాళాలను తీయించి ఉద్యోగులు విధులు నిర్వహించే ఏర్పాట్లు చేయిస్తానని అన్నారు. అలాగే గ్రామంలో ముగునీరు పోయేందుకు కాలువలు, రోడ్లు లేవని వివరించారు. స్పీకర్ మాట్లాడుతూ కొన్ని పనులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తే.. మరికొన్ని పనులు పంచాయతీ ఆధ్వర్యాన జరగాలని అన్నారు. విద్యుత్ స్తంభాలు మేము వేయిస్తే వాటికి బల్బులు పంచాయతీలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులు మేము నిర్మిస్తే.. కాలువలు పంచాయతీలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఇదంతా ఒక పద్ధతి అని, పంచాయతీలకు నిధులు మంజూరు అవుతాయని, వాటితో పనులను చేపట్టాలని సర్పంచ్‌కు సూచించారు. ఇది సమయం సందర్భం కాదని, నేను ఏ విషయాలపై ఇక్కడ మాట్లాడ దలుచుకోలేదని అన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన విత్తనాలను రైతులకు పంపిణీ చేసి అక్కడ నుంచి వెనుదిరిగారు. జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ బొడ్డేపల్లి పసుమతి, ఎంపిటిసి మాజీ సభ్యులు గురుగుబెల్లి ప్రభాకరరావు, ఎఒ మెట్ట మోహనరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతున్న సర్పంచ్ గౌరీపతి

కౌలు రైతుల గుర్తింపులో అలసత్వం వద్దు

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- టెక్కలి
టెక్కలి సబ్ డివిజన్ రెవెన్యూ పరిధిలో ఉన్న పలు మండలాల్లో నమోదైన కౌలు రైతు గుర్తింపుపై మరోసారి సమీక్షించి గుర్తింపులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి రెవెన్యూ, వ్యవసాయశాఖ, వంశధార, అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చే పరిహారం అందిరికీ అందాలంటే నమోదులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు. గ్రామసభలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు గుర్తించిన వారి జాబితా రూపొందించి ప్రదర్శించాలని, ఇంకా ఏమైనా సర్దుబాట్లు ఉంటే వాటిని సవరించి పక్కాగా సర్వే చేపట్టాలని అన్నారు. ఈ నెల 21న నుంచి గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళిక రూపొందించుకుని ఆయా గ్రామాల్లో ప్రచారం చేపట్టాలన్నారు. గ్రామసభలో ఎక్కువగా రైతులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ వ్యవసాయ పనులకు రైతులు సిద్ధమవుతారని, ఇటువంటి నేపథ్యంలో సాగునీరు అందించే చెరువులు, కాలువలను పరిశీలించి ఆయకట్టు భూములు, వర్షాధార భూములను పరిశీలించి ప్రతి ఎకరాకూ సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్ స్థాయి తహశీల్దార్లు, ఎఒ, కార్యాలయ ఎఒ రాజమోహన్, డివిజన్ గణాంక అధికారి పి.సి.నంద, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు 28 వినతులు

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 28 వినతులందాయని సబ్ కలెక్టర్ తెలిపారు. వీటిలో అధిక భాగం ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం దరఖాస్తులు వచ్చాయని అన్నారు. బన్నువాడ గ్రామ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు నేలమట్టమైన వారికి నష్టపరిహారం నేటికీ అందలేదని, పరిహారం చెల్లించాలని కంచ్రవీధికి చెందిన బాధితులు కోరారు. స్పందనలో వచ్చిన దరాఖాస్తులన్నింటినీ పరిశీలించి ఆయా శాఖాధికారులకు అందజేస్తామని తెలిపారు.

'ఆణిముత్యాలు'తో విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- సంత బొమ్మాళి
మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలును సర్పంచ్ జోగి రాములమ్మ సోమవారం ప్రదానం చేశారు. మొదటి బహుమతి సాధించిన అల్ల ధనంకు రూ.3 వేలు, గోల్డ్ మెడల్, ప్రశంస పత్రం, ద్వితీయ బహుమతి మైలపల్లి స్వాతికి రూ.2 వేలు, సిల్వర్ మెడల్, ప్రసంశ పత్రం, తృతీయ బహుమతి వంకల రేవతికి రూ.వెయ్యి, బ్రాంజ్ మెడల్, ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లండ రామారావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పుక్కళ్ల లక్ష్మణరావు, ప్రధాన ఉపాధ్యాయులు ఎస్.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ రాములమ్మ

పలాస : జగనన్న ఆణిముత్యాలు విద్యార్థులు వరమని రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు అన్నారు. మండలంలోని రెంటికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.నిర్మల, ఎస్ఎంసి చైర్మన్ హెచ్.మహేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదమిత్రలకు కిట్లు అందజేత

శ్రీకాకుళం అర్బన్ : ప్రకృతి సిద్ధంగా, మానవ ప్రేరితంగా సంభవించే పలు రకాల విపత్తుల నివారణలో సహాయ సహకారాలు అందించడానికి ఆపద మిత్ర వాలంటీర్లను నియమించారు. గతంలో శిక్షణ తీసుకున్న ఈ వాలంటీర్లకు ఆపదల నివారణకు అవసరమైన సామగ్రితో కూడిన కిట్లు అందజేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెసి ఎం.నవీన్ ఈ కిట్లను సోమవారం వాలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న జెసి నవీన్

డీసెట్‌లో రమ్యకు 23వ ర్యాంకు

ప్రజాశక్తి- పొందూరు
సోమవారం విడుదల చేసిన డీసెట్ ఫలితాల్లో పొందూరు మండలం బురిడి కంచరాంకు చెందిన మీసాల రమ్య రాష్ట్రస్థాయిలో 23 ర్యాంకును సాధించి తన ప్రతిభను కనపర్చింది. ఈమె సైన్స్ విభాగంలో 52 మార్కులు సాధించి 23వ ర్యాంకును కైవసం చేసుకుంది. విద్యార్థిని తల్లిదండ్రులు రామలక్ష్మి, కోటేశ్వరరావులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ పిల్లలను చదివిస్తున్నారు. రమ్య పదో తరగతిలో 587 మార్కులు సాధించగా, ఇంట ర్మీడియట్ లో 807 మార్కులు సాధించింది. ఈమె మాట్లాడుతూ గ్రామంలో ఎస్ఎస్ఆర్ ట్యూషన్ సెంటర్ ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రమ్యకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ట్రోఫీని అందజేస్తున్న తిలక్

క్రీడలతో మానసికోల్లాసం

నందిగాం: క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. పది రోజులుగా కణితివూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న బగాది రాకేష్ మెమోరియల్ క్రికెట్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విజేతలకు సోమవారం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, తిలక్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందజేస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, వైస్ ఎంపిపి సువ్వారి వసంత్ కుమార్, కవిటఅగ్రహారం సర్పంచ్ బొమ్మాళి గున్నయ్య, ఎంపిటిసి అంబోడి విష్ణు, పేరాడ రమేష్, కవిటి వెంకట్, బగాది నారాయణరావు, కూనపు ధర్మారావు పాల్గొన్నారు.

నేడు డీలర్ల సమావేశం

లావేరు : స్థానిక పౌర సరఫరాల గోదాం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు లావేరు, రణస్థలం మండలాలకు చెందిన రేషన్ డీలర్ల సమావేశం నిర్వహిస్తున్నామని రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు లంక అబ్బినాయుడు, ప్రధాన కార్యదర్శి ముప్పిడి రమేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డీలర్ల సమస్యలపైన, సరకులు తరుగుదలపైన చర్చించి సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయంపై చర్చిస్తామన్నారు. లావేరు, రణస్థలం మండలాల్లోని డీలర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న ఇబ్రహీం

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిశీలన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రాంతంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని రెండు గ్రూపులకు చెందిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎపి వక్‌బోర్డు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి మూసాభిన్ ఇబ్రహీం సోమవారం పరిశీలించారు. అనంతరం లాలపేటలో ఉన్న మసీద్ వద్ద ముస్లీం పెద్దలతో, యువకులతో చర్చించారు. ఇరు గ్రూపులు చెప్పిన సమస్యలు విన్నారు. ప్రధానంగా ముతవల్లి ఆక్రమణలు, పీర్ల పంజా ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ ఆక్రమణ తొలగింపునకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు. చర్చల ద్వారా వివాదం విష్కరిస్తామని అన్నారు. అనంతరం సాదీ ఖానీ ప్రతిపాదనలు పెద్దలు ఆయన ముందు ఉంచారు. కార్యక్రమంలో అబ్దుల్ కుద్దుస్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న గిరిబాబు

ఘనంగా గిరిబాబు జన్మదిన వేడుకలు

పలాస: పలాస మున్సిపల్ చైర్మన్ స్వగ్రామంలో సోమవారం బల్ల గిరిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధ్యక్షతన గిరిబాబు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, వైసిపి, టిడిపి నాయకులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, మున్సిపల్ డిఇ బల్ల హరి, టిపిఒ సీతారాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, డబ్బీర్ భవానీశంకర్, డబ్బీర్ నాగు, సనపల సింహాచలం, బల్లయ్య, ఎస్.గోపి, అంబటి ఆనంద్, బమ్మిడి సంతోష్‌కుమార్, రోణంకి శ్రీనివాసరావు, సత్యం, గూన మన్మథ పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

పలాస: మండలంలోని మొగిలిపాడు జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాసకు చెందిన ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చెందిన కొమర పూర్ణ, నందిగాం కార్తిక్, మౌళి వేదాంత్‌లు కలిసి కాశీబుగ్గ జిఎంఇ నుంచి పలాస కారులో వెళ్తున్నారు. రోడ్డుపై ఓ వ్యక్తి అడ్డంగా వస్తుండంతో ఆయనను తప్పించబోయి జాతీయ రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే క్షతగాత్రులను స్థానికులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

శ్రీకాకుళం అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో విలీన పంచాయతీగా ఉన్న ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రీయల్ ఏరియాలో వైఎస్ఆర్, సిఎంఎవై పథకాల కింద ఇళ్ల పట్టాలు ఇచ్చారని, కొన్నేళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నా మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోయారు. జెడ్‌పిలో నిర్వహించిన నిర్వహించిన స్పందనలో జెసి ఎం.నవీన్‌ను సోమవారం వినతిపత్రం అందజేశారు. తాము నివాసముంటున్న ప్రాంతానికి విద్యుత్, తాగునీటి సౌర్యం, సిసిరోడ్లు తదితర సదుపాయాలు కల్పించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. విద్యుత్‌శాఖ ఎఇని విద్యుత్ సౌకర్యం కోసం విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వివరించారు. అలాగే తాగునీటి అవసరాలకు నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు పనులు 80 శాతం పూర్తి చేసి, మిగిలిన 20 శాతం పూర్తి చేయకుండా వది లేశారని అన్నారు. పైపులైన్ ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించినా అది పూర్తిస్థాయిలో ఎవరికీ సరిపోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా తమ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. జెసిని కలిసిన వారిలో ఎస్.పుష్పలత, కె.సుశీల, బి.ధనలక్ష్మి, పి.శాంతి, వై.రాధ, హేమలత, కె.వెంకటలక్ష్మి ఉన్నారు.

వినతిపత్రం అందించేందుకు వచ్చిన మహిళలు

విస్తృతస్థాయి సమావేశానికి టిడిపి నాయకుల హాజరు

పాల్గొన్న టిడిపి జిల్లా నాయకులు

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు సమస్యలను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి ఎమ్మెల్యే అశోక్ తీసుకెళ్లారు. విజయవాడలోని మంగళగిరిలో సోమవారం నిర్వహించిన టిడిపి రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నియోజకర్గస్థాయి చర్చలో ఇచ్ఛాపురంలో ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వం తీసుకుంటున్న అస్తవ్యస్త నిర్ణయాలతో నిర్వీర్యమవుతున్న వ్యవస్థలు తదితర అంశాలపై ఎమ్మెల్యే అశోక్ కూలంకుషంగా వివరించారు.

పలాస : మంగళగిరిలో జాతీయ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష పాల్గొన్నారు.

కిరణ్మయికి మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారం

శ్రీకాకుళం : ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన జిల్లా విద్యార్థులకు గుంటూరు మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారాలను ఆదివారం స్థానిక బాపూజీ కళామందిరంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు శ్రీమాన్ అరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు మనుమరాలు పూర్ణశ్రీ సత్య కిరణ్మయి 964 మార్కులు సాధించినందున సంస్థ ప్రతినిధులు ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని అందించి అభినందించారు. కిరణ్మయి తండ్రి ఆరవెల్లి గుహానంద్ ఆంధ్రజ్యోతి సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. తల్లి కనకదుర్గ ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయురాలు. కిరణ్మయిని బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులు అభినందించారు.

పురస్కారాన్ని అందుకుంటున్న పూర్ణశ్రీ సత్య కిరణ్మయి

వెనుకబడిన బిసిలను ఆదుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
దేశవ్యాప్తంగా చేపడుతున్న కుల గణనలో వెనకబడిన తరగతుల్లో అట్టడుగున ఉన్న తెగలపై అధ్యయనం చేసి ఆదుకోవాలని ఉత్తరాంధ్ర ఎంబిసి చైతన్య వేదిక నాయకులు డాక్టర్ ఆర్.అరవింద్ కోరారు. నగరంలోని నాయీబ్రాహ్మణ సామాజిక భవన్‌లో సోమవారం వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంబిసిలకు పది శాతం రిజర్వేషన్ కల్పించి విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బలోపేతం చేయాలన్నారు. బిసిలకు దామాషా పద్ధతిలో రాజ్యాధికారం సాధించుకోవాలన్నారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతి, దేవ్, కస్పా శ్యామలరావు, కింతలి రాము, దుంప శివప్రసాదరావు, ఉమామహేశ్వరరావు, ముంగండి సూర్యనారాయణ, రౌతు శంకరరావు పాల్గొన్నారు.

పోలీసులా.. వైసిపి కార్యకర్తలా!

టిడిపి రాష్ట్ర కార్యదర్శి బాబూరావు

పలాస: పలాస నియోజకవర్గంలో పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి వైసిపి పార్టీకి కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మందస మండలం బాలిగాంలో టిడిపి జెండా దిమ్మ తొలగించే విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉన్న ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, శాంతిభద్రతకు అఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. 30 ఏళ్ల నుంచి ఆర్అండ్‌బి రోడ్డుకు సమీపంలో టిడిపి జెండాతో పాటు దిమ్మ ఉందని, ఇన్నేళ్లుగా లేని ఇబ్బంది ఇప్పుడు వచ్చిందా? అని ప్రశ్నించారు. పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పైశాచిక ఆనందం పొందుతున్నారని, అందులో భాగంగానే అధికారాన్ని అడ్డం పెట్టుకొని పోలీసులతో టిడిపి జెండా దిమ్మను తొలగించడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఏ పార్టీకి చెందినవారు ఆ పార్టీ జెండాలు గ్రామాల్లో పెట్టుకోవడం రాజ్యాంగ హక్కు అని, అటువంటి జెండాపై రాజకీయం చేయడం తగదని హితవుపలికారు. రోడ్డుకు అడ్డంగా ఉందనుకుంటే అక్కడికి నాలుగు మీటర్ల దూరంలో వైసిపి జెండా దిమ్మ కూడా ఉందని గుర్తు చేశారు. తమ పార్టీకి చెందిన జెండాను పునరుద్ధరణ చేశాక మళ్లీ పోలీసులు ప్రొక్లెయినర్‌తో తొలగించడాన్ని తప్పుబట్టారు. శాంతియుతంగా, సౌమ్యంగా ఉండే మాజీ మంత్రి శివాజీపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని మండిపడ్డారు. సమావేశంలో లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్త, నాగరాజు, నవీన్, అంబటి కృష్ణమూర్తి, పాండు, సత్యం, బి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబూరావు

'ఉపా' కేసును ఎత్తివేయాలి

ఆందోళన చేస్తున్న పిఒడబ్ల్యు నాయకులు

ప్రజాశక్తి- పలాస
ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజ, విమలక్కపై నమోదు చేసిన ఉపా చట్టం కింద నమోదు చేసిన కేసును తక్షణమే ఎత్తి వేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కుసుమ డిమాండ్ చేశారు. మండలంలోని మాక్కనపల్లి అమరవీరుల ఘాట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్‌లో 2022 ఆగస్టు 1న పిఒడబ్ల్యు సంధ్య, ప్రజాపక్ష మేథావి ప్రొఫెసర్ హరగోపాల్ తదితర 152 మంది ప్రజా సంఘాల నాయకులపై తప్పుడు పద్ధతిలో రాజద్రోహం కుట్ర కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళా హక్కుల కోసం 40 ఏళ్ల అవిశ్రాంతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్న సంధ్యను నిషేధిత మావోయిస్టు పార్టీ వ్యక్తిగా ముద్ర వేయడం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోరాడుతున్న మేథావులు అక్రమ కేసుల్లో ఇరికించడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కె.హేమమ్మ, జానకమ్మ, ఇందిరమ్మ, సీతమ్మ, సరస్వతి, అఖిల భారత రైతు కూలీ సంఘం గోరకల బాలకృష్ణ, జగన్, అప్పయ్య పాల్గొన్నారు.

ఆట స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్ కాలనీలో ఎంపిపి స్కూల్‌లో ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం, ఆట స్థలానికి ఆక్రమణదారులు ఆక్రమించుకున్నారని మాజీ సర్పంచ్ ఎద్దు హరిదాస్‌తో పాటు గ్రామలు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో డిటి బాణం వెంకటరమణకు ఫిర్యాదు సోమవారం చేశారు. చుకున్నారు. టిడి స్పందిస్తూ నాలుగు రోజుల్లో విచారణ చేపడతామని హామీనిచ్చారు. అలాగే రజకులు దుస్తులు ఉతికేందుకు దోబీ ఘాటు ఏర్పాటు చేయాలని రజక పెద్దలు పి.శ్రీరాములు, గోరుశెట్టి సింహాచలం తహశీల్దార్ చక్రవర్తి, ఎంపిడిఒ ఎం.పావనికి వినతిపత్రం అందజేశారు.

రాహుల్ నాయకత్వం అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం
భావి భారత ప్రధానమంత్రిగా తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చూడడమే తమ లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన అధ్యక్షులు రెల్ల సురేష్ పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన భవనంలో రాహుల్‌గాంధీ జన్మదిన సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం కార్యాలయం నగర ప్రధాన కూడళ్ల మీదుగా సాగి తిరిగి ప్రారంభ స్థానానికి పాదయాత్ర చేపట్టారు. అలాగే బెహరా మనో వికాస కేంద్రంలోనూ కేక్ కట్ చేసి చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సనపల అన్నాజీరావు, బసవ షణ్ముఖరావు, ఎల్.నారాయణరావు, అంబటి కృష్ణ, మధుసూదనరావు, పైడి నాగభూషణరావు, వెంకటరావు, దాలినాయుడు, గోవింద మల్లిబాబు పాల్గొన్నారు.

టెక్కలి : దుస్తులను అందజేస్తున్న పరమేశ్వరరావు

టెక్కలి: దేశంలో మత విద్వేషాలకు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా జాతీయ ఉద్యమం చేపడుతున్నామని, ఆ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ నాయకత్వానికి ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. రాహుల్‌గాంధీ జన్మదిన వేడుక సోమవారం స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆచరిస్తున్న రాచరిక నిరంకుశ విధానాల్ని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి మోదీ బయటకు పంపారని విమర్శించారు. అనంతరం 40 మంది పేదలకు దుస్తులు, అల్పాహారాలను అందజేశారు. కార్యక్రమంలో కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనందరావు, టి.వినయ్, పేడాడ సూర్యనారాయణ, కవిటి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ 53వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ కొత్తకోట్ల సింహాద్రినాయుడు, స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి బర్త్ డే కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. యువతరనికి ఆదర్శ నేత, కాంగ్రెస్ పార్టీ దిక్సూచి రాహుల్ అని అన్నారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ లక్ష్మి, జోగినాయుడు, జగదీష్ నాయుడు, ఎస్‌సి సెల్ నాయకులు వై.సూర్యనారాయణ, సోషల్ మీడియా నాయకులు మీసాల గణేష్ పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రణస్థలం రూరల్ : కేక్‌ను కట్ చేస్తున్న సింహాద్రినాయుడు

పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

పథకాలకు అర్హతే ప్రామాణికం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అర్హత ప్రామాణికంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తండ్యాం పంచాయతీ గూనానపేట, కిల్లారిపేట, బొట్లపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి ఏ మేరకు చేకూరురుతుందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, ఎంపిటిసి ప్రతినిధి వడగ మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

కోర్సుల నిర్వహణలో ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎంతో మంది ఉన్నతికి కారణమైన శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునేందుకు విద్యార్థుల్లో ఏటా ఆసక్తి కనబడుతోందని, అయితే అవగాహన లేకుండా కోర్సుల్లో చేరడం వల్ల జీవిత కాలం ఆ విద్యార్థి సతమతమవుతూ గడపాల్సి వస్తుందని ప్రిన్సిపాల్ పి.సురేఖ పేర్కొన్నారు. కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో 2023 -24 విద్యా సంవత్సరంలో కళాశాలలో చేరేందుకు వచ్చిన విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి తన ఆలోచనలకు అనుగుణంగా కోర్సుల్లో చేరాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకునేందుకు సులభ తరమవుతుందని అన్నారు. వంద మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మిత్రులతో ఈ కార్యక్రమానికి హాజరై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కళాశాల అడ్మిషన్ల కన్వీనర్ బి.మోహనరావు ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నాలుగేళ్ల డిగ్రీ హానర్స్ సింగిల్ మేజర్ సబ్జెక్టు గురించి వివరించారు. కళాశాల ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల విద్యాశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 15 సింగిల్ మేజర్ సబ్జెక్టులతో బిఎ, బికాం, బిఎస్‌సి, హనర్స్ డిగ్రీ ప్రవేశాలకు అనుమతులు ఇచ్చారు. జిల్లాలోని పది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధికంగా విద్యార్థినీ విద్యార్థులు చేరాలని కోరారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ శేఖర్

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్

కవిటి: పాలనలో పారదర్శకత పాటించి, ప్రజల వద్దకే పాలనలో భాగంగా ఇకపై సచివాలయాల్లోనే భూ రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తహశీల్దార్ పి.శేఖర్ తెలిపారు. మండలంలోని పుతియాదల రెవెన్యూ పరిధిలోని రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పుటియాదల, రఘునాథపురం, బింజగిరి, వరక గ్రామాల్లో ఇప్పటి వరకు భూ రీ సర్వే పూర్తయిందని అన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్లు కొనసాగుతుందని తెలిపారు. భూ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల పరిధిలోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రజల వద్దకే పాలనలో భాగంగా ముఖ్యమంత్రి పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగా ముందుగా చెప్పినట్టు సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, విఆర్ఒలు దివాకర్, నారాయణ పాల్గొన్నారు.

బహుజన ఐక్యవేదిక ఏర్పాటు

రణస్థలం రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో దళిత సంఘాల ఆధ్వర్యాన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు లాషా సోమేశ్వరరావు, గంట్లాన రామారావు, ఇనప దుర్గారావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండలంలో దళితులపై జరుగుతున్న దాడులను బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు వచ్చిన అనేక భూ సమస్యలు, వివిధ రకమైన సమస్యలపై తమ గోడు పెట్టుకున్నారు. సమస్యలతో నెలలు తరబడి తహశీల్దార్ కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని బాధితులు వాపోయారు. అనంతరం బహుజన ఐక్యవేదిక అనే పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. బహుజన ఐక్యవేదికకు అధ్యక్షులుగా సాకేటి పోతయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా యజ్జల సోములు, ఉపాధ్యక్షులుగా పల్ల అప్పన్న, ఇంటి హరిప్రసాద్, దత్తి గోవింద, బొమ్మలాట రాము, సూరప్పుడు, గుర్ల రమణ, ప్రధాన కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

కవిటి : మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి- కవిటి

ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా వారికి అందిన లబ్ధి వివరించి, సత్వరమే వారి సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ పి.శేఖర్, ఎంపిడిఒ పి.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజుల పాటు జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి వార్డు గ్రామ సచివాలయం పరిధిలో వాలంటరీ, గృహ సారథులు ఇంటింటినీ సందర్శిస్తారని అన్నారు. వారి తాలూకా ఫిర్యాదులు, అభ్యర్థనలను యాప్‌లో పొందుపరిచి సచివాలయంలో తెలియజేస్తారని తెలిపారు. తరువాత ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికీ మండల స్థాయి అధికారిని ఒకరోజు కేటాయించి వీటిని పరిష్కరిస్తారని తెలిపారు. ముఖ్యంగా కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధృవీకరణ పత్రాలు, కుటుంబ ధృవీకరణ పత్రం, మ్యుటేషన్ లావాదేవీలు, ఫోన్ నెంబర్లకు ఆధార్ అనుసంధానం, కౌలు రైతులకు కార్డులు జారీ చేయడం వంటివి అక్కడిక్కడే జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రతివ్యక్తీ లబ్ధి పొందేలా, పథకాల్లో పారదర్శకత ఉట్టిపడేలా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వారిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిటి టి.రామచంద్రరావు, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: జులై 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు కోరారు. మండల పార్టీ విప్ బొడ్డు అప్పన్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు అందరూ కలిసి సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పలాస : జులై 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ రమేష్ నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో విఆర్‌ఒలతో, కార్యదర్శులతో, వెల్ఫేర్ అసిస్టెంట్లతో డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే జగనన్న సురక్ష పథకం ద్వారా వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో పలాస పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంం రావు, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : జగనన్న సురక్ష విజయవంతం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి కార్యదర్శులు, విఆర్‌ఒలతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, ఎఒ తిరుపతిపట్నాయక్, ఆర్‌ఐ వైకుంఠరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగనన్న సురక్ష విజయవంతంపై కమిషనర్ రమేష్ తన కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మహేష్, సచివాలయ అడ్మిన్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

జీడి రైతులను ఆదుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డపాడు రైతులు

ప్రజాశక్తి- పలాస

ఉద్దానంలో విస్తారంగా పండే జీడి పంట రైతులకు ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని, 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు కనీస మద్దతు ధర కల్పించాలని జీడి రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డపాడులో జీడి మద్దతు ధరపై సోమవారం జీడి రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడి రైతులు మాట్లాడుతూ తీత్లీ తుపాను నుంచి జీడి పిక్కల రైతు ఇప్పటికీ కోలుకోలేదని అన్నారు. అప్పటి టిడిపి నుంచి నేటి వైసిపి వరకు ఏ ప్రభుత్వాలు జీడి రైతులను కనీసం ఆదుకునే పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో జీడి, మామిడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పిక్కలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పరిశ్రమ కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేయాలని, నాణ్యమైన మొక్కలను అందించాలని కోరారు. జీడి పంట విస్తరణ నిర్వహణకు రాయితీలు ఇవ్వాలని, జీడితోటలో అంతర కృషికి పరికరాలు రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరా జీడి తోట అభివృద్ధికి మూడేళ్లకు రూ.లక్ష రైతుకు క్షేత్రస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో జీడిపిక్కలు, జీడిపప్పుకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. జీడిపిక్కలు ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్లను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో దాసరి శ్రీరాములు, టి.త్రిలోచనరావు, ధర్మారావు, బి.సింహాద్రి, తామడ రామారావు, బొడ్డు జగన్, గర్తం కూర్మరావు, రాజాం గుణవంతు, రాజాం శ్రీనివాసరావు, బి.బాలరాజు, వంశీ పాల్గొన్నారు.

జులై 31లోగా ఈ-ఫైలింగ్ చేయించుకోవాలి

ఆమదాలవలస : ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చే పెన్షనర్లందరూ జులై 31లోగా ఈ-ఫైలింగ్ తప్పక చేయించుకోవాలని సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజు తెలిపారని ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్స్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-ఫైలింగ్ చేయించుకునే పెన్షనర్లు స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయానికి వచ్చి ఫారం-16ను తీసుకోవాలన్నారు. ఫారం-16ను పూర్తి చేసి ఎస్‌టిఒ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం : మండలంలో కొఠారి పంచాయతీ ఎర్ర చెరువులో రూ.7.90 లక్షలతో చేపట్టనున్న ఉపాధి హామీ పనులను జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ దక్క ధనలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ ఉప్పాడ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఛార్జీల పెంపుపై

రౌండ్‌టేబుల్ సమావేశం

పలాస : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు వామపక్షాల ఆధ్వర్యాన కాశీబుగ్గ గణపతి లాడ్జిలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఐ నియోజకవర్గం నాయకులు చాపర వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు తప్పకుండా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మట్టితో నిండిన కాలువ

వంశధార కాలువ ఆక్రమణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నాలుగేళ్లుగా వంశధార కాలువల్లో సాగునీటి గలగలలు లేవు.. సాగునీరు అందించని కాలువ ఎందుకు అని భావించారో కానీ కాలువ సమీప రైతులు ఏకంగా వంశధార కాలువలో మట్టి పోసి ఆక్రమించుకున్నారు. పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధి కొల్లిపాడు సమీపం నుంచి వంశధార 60 ఆర్ఎల్ 5 ఎల్ బెండి కాలువ వెళుతుంది. సాగునీటి కాలువ ఆక్రమణలకు గురవుకుంటే వంశధార, రెవెన్యూ అధికారులు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ దగ్గరకు వచ్చేసినా ఇప్పటి వరకు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. దీంతో ఈ ఏడాదీ సాగునీరు అందే పరిస్థితి లేదని దిగువ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార కాలువకు కొల్లిపాడు సమీపంలో ఆక్రమణలు తొలగించడంతో పాటు కాలువలో పూడికతీత పనులు చేపట్టి ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై తహశీల్దార్ బి.అప్పలస్వామి మాట్లాడుతూ వంశధార కాలువ ఆక్రమణపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జగన్నాథ రథయాత్రకు ఏర్పాట్లు పూర్తి

ఇచ్ఛాపురం : ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం జగన్నాథ స్వామి రథయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎండోమెంట్ అధికారులు బెండి రామారావు అధ్యక్షతన స్థానిక జగన్నాథ స్వామి సేవకులు పర్యవేక్షణలో ఈ నెల 20 నుంచి జరగనున్న రథయాత్రకు ప్రధాన ఆలయంతో పాటు దాసన్నపేట వద్ద ఉన్న చిన్న ఆలయానికి రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. 20న సాయంత్రం ప్రధాన ఆలయం నుంచి రథంపై యాత్రికుల జేజే ధ్వనుల మధ్య యాత్ర కొనసాగుతుంది. చిన్న దేవాలయం వద్ద 28 వరకు అక్కడే ఉండి దశావతారాలు యాత్రికులకు దర్శనం ఉంటుంది. ఏటా ఈ యాత్ర తిలకించడానికి వేలాది మందికి యాత్రికులు తరలివస్తారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పట్టణ పోలీసులు, అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయానికి వేసిన రంగులు

వరి విత్తనాల పంపిణీ

కవిటి : విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- నందిగాం

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తిలు అన్నారు. నందిగాం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎఒ శ్రీకాంత్‌వర్మ అధ్యక్షతన సోమవారం వరి, కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతు సంక్షేమంపై పూర్తిస్థాయి దృష్టి సారించి ఖరీఫ్ ప్రారంభం కాకముందే సకాలంలో వరి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారని అన్నారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు మడపాల సంజీవరావు, తమిరి దేవేందరరావు, హనుమంతు బుజ్జి పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురం రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్కవరం సర్పంచ్ పోట్నూరు భూలక్ష్మి, ప్రతినిధి అప్పలనాయుడు, డిడిఒ పాల రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి వర్ధన్, ఎఒ సుమంత్, కూన చంద్రరావు, రైతులు రామారావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో కొణుసుల కొత్తూరు రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌కు వరి విత్తనాలను సర్పంచ్ మొర్రి శంకరరావు, చాకిపల్లి సర్పంచ్ వాన తవటయ్య రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి చాకిపల్లి ఎంపిటిసి ప్రతినిధి పొందర శ్రీనివాస్, ఉపసర్పంచ్ దల్లిసుభద్రమ్మ, కార్యదర్శి కలిశెట్టి చంద్రరావు, ఆర్‌బికె చైర్మన్ వాన అప్పన్న, విగ్గు బి.జనార్ధనరావు, వార్డు మెంబరు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బెలగాం ఆర్‌బికె పరిధిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, నెలవంక ఆర్‌బికె వద్ద ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్ రెడ్డి, ఎంపిటిసి చిన్నారెడ్డి, జగతిలో సర్పంచ్ పూడి ప్రసాదరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, బెజ్జిపుట్టుగలో సర్పంచ్ నారాయణ స్వామి, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, బొరివంకలో సర్పంచ్ బెందాలం శ్రీరాం ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, బల్లిపుట్టుగలో సర్పంచ్ ప్రతినిధి రజనీ కుమార్ దొలై రైతులకు వరి విత్తనాలు అందజేశారు.

నందిగాం : విత్తనాలను అందజేస్తున్న తిలక్, శ్రీరామ్మూర్తి

వినతిపత్రం అందజేస్తున్న అప్పలనాయుడు

అర్హులందరికీ వేట భృతి చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎచెర్ల నియోజకవర్గం పరిధిలోని రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో అర్హులైన మత్స్యకారులందరికీ చేపల వేట విరామ కాలానికి భృతిని ప్రభుత్వం చెల్లించాలని పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మర బోట్లలో పనిచేసే జాలర్లనూ అర్హులుగా గుర్తించి, వారికి వేట విరామం భృతిని చెల్లించాలని కోరారు. అలాగే ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజవర్గం పరిధిలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లోని మామిడి పంట రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారని, మామిడి పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోయారని తెలిపారు. రెండు నెలల కాలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో మామిడి పంట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు.

రైతులతో మాట్లాడుతున్న అనురాధ

వేరుశనగ సాగు విస్తీర్ణం పెంచాలి

కోటబొమ్మాళి: మండలంలో వేరుశనగ సాగుచేస్తున్న రైతులు పంట విస్తీర్ణం పెంచాలని నీతి అయోగ్ డిప్యూటీ డైరెక్టర్ బి.అనురాధ అన్నారు. మండలంలోని వాండ్రాడలో వేరుశెనగ సాగు చేసే రైతులతో సోమవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వేరుశెనగ సాగుకు విస్తీర్ణ పెంచడానికి, దిగుబడుల పెంచడానికితో పాటు రైతులకు వేరుశెనగ పంట మరింత గిట్టుబాటు రావడానికి ప్రభుత్వం నుంచి కావాల్సిన సహాయ సహకారాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. జెడి కార్యాలయం ఎఒ ఇందుమతి, స్థానిక ఎఒ ఎస్.గోవిందరావు, వాండ్రాడ గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న అప్పలనాయుడు

జెవికె కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పెదలింగాలవలసలో ఎలిమెంటరీ స్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్లను వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు, లింగాలవలస సర్పంచ్ లుకలాపు యశోద, స్కూల్ చైర్మన్ బొబ్బాది సూర్యారావు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న తల్లిదండ్రులకు భారం లేకుండా విద్యార్థిని విద్యార్థులకు తన సొంత పిల్లలగా భావించి స్కూల్ బ్యాగ్, పుస్తకాలు, షు, టై, యూనిఫామ్, నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో లింగాలవలస ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం గణపతి, టీచర్స్ చంద్రశేఖర్, కొత్తకోట మాజీ సర్పంచ్ శివగం నాగరాజు, నెల్లి దాలినాయుడు, సందక నాగరాజు, వాలంటీర్ చందక శివ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న హెచ్‌ఎం మురళీమోహనరావు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని మలకాం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సోమవారం ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి మురళీమోహనరావు ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు లంకలపల్లి వెంకటరమణ, ఆరవెల్లి హేమసుందర్, మాడుగుల రోజాలకు దుశ్శాల్వు కప్పి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు వారు చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జూడ అప్పలనాయుడు, రమణ, పాఠశాల చైర్మెన్ చదువుల సురేష్, విశ్రాంత ఇంజినీర్ అల్లంశెట్టి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పొందూరు అప్పారావు, మొగదాల రమణారావు, సత్యనారాయణ, అప్పన్న, భాగ్యలక్ష్మి, గౌరి, పుష్పలత పాల్గొన్నారు.